క్లుప్తంగా

రాచమల్లు రాజన్న అన్నదాన పనుల పరిశీలన



రాచమల్లు రాజన్న అన్నదాన కార్యక్రమ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు: స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలంలో జరుగుతున్న రాచమల్లు రాజన్న అన్నదాన కార్యక్రమం పనులను శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లవోలులో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలకు వైద్యాధికారి శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా నూతన విగ్రహ ప్రతిష్ట

బి.కోడూరు : నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బి.కోడూరులోని రామాలయంలో వేదపండితులు రెండోవరోజు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కమీషన్ల కోసమే గీతాశ్రమంలో అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణ గీతాశ్రమంలో దేవదాయశాఖ అధికారులు కమీషన్ల కోసమే అభివృద్ధి పనులు చేపడుతున్నారని ఎంఎస్ శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి ఆరోపించారు. శుక్రవారం గీతాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న స్వామీజీలు ఆశ్రమాన్ని విద్యాపరంగా, ఆధ్యాత్మికంగా ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. నామా ఎరుకలయ్య విద్యాభివృద్ధి కోసం గీతాశ్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆశ్రమంలో రూ.21లక్షలతో నిర్మించిన భజన మందిరం నిరుపయోగంగా మారిందన్నారు. రూ.18లక్షలతో నిర్మించిన 10 బాత్రూంలు నాసిరకంగా ఉన్నాయన్నారు.

లోకేష్‌కు చట్టాలపె అవగాహన ఉందా?

ప్రొద్దుటూరు : ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీలకు రక్షణగా చట్టం తెస్తానని టీడీపీ నాయకుడు నారా లోకేష్ చెప్పిన మాటలు హాస్యాస్పందంగా ఉన్నాయని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం తేవాలంటే పార్లమెంట్‌లో ఆమోదం పొందాలని, కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు ఇందుకు అనుకూలంగా ఉండాలని తెలిపారు. ఇలాంటి విషయాలను చెప్పకుండా బీసీలకు రక్షణ చట్టం తెస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. బీసీలకు, ఎస్సీలకు మధ్య చిచ్చు పెట్టినట్లేనన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డిపై లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

సబ్సిడీతో జీలుగల పంపిణీ

దువ్వూరు : వరి పంటను సాగు చేసే రైతులకు ఈ నెల 5వ తేదీ నుంచి జీలుగలను 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. కేజీ జీలుగలు రూ.79 ఉండగా సబ్సిడీ పోను రైతు రూ.39.50 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. జీలుగలు కావాల్సిన రైతులు వారికి అందుబాటులో ఉన్న ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నాడు కంట నీరు.. నేడు పంట హోరు

- నాడు విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు నేడు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు
- చంద్రబాబు హయాంలో కేసీ ఆయకట్టు పరిధిలో రెండు సార్లు క్రాప్ హాలిడే
- నేడు రూ.1300 కోట్లతో జరుగుతోన్న కుందూ నది విస్తరణ



చంద్రబాబు హయాంలో విత్తనాల కోసం వేచి చూస్తున్న రైతులు



నేడు రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు ఇస్తున్న దృశ్యం

చాపాడు : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యవసాయాన్ని విస్మరించి రైతులను నట్టేట ముంచారు. బాబు హయాంలో మైదుకూరు నియోజకవర్గంలోని రైతులు ఆపసోపాలు పడ్డారు. విత్తనాల కోసం రోజుల తరబడి మండలాల కార్యాలయాల వద్ద క్యూలైన్‌లలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేది. వ్యయ ప్రయాసలు పడి విత్తనం చేతికొచ్చిన సాగునీరు లేక పెట్టిన పెట్టుబడి, శ్రమ నీళ్లపాలయ్యేది. 2014–19లలో నియోజకవర్గంలోని రైతాంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో కేసీ కెనాల్ ఆయకట్టు కింద 53 వేల ఎకరాల్లో పంటలను రైతులు సాగు చేసేవారు. పంట కాపాడుకోవడానికి సాగునీటి కోసం రైతులు పదుల సార్లు రోడ్డు ఎక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి దాపురించేవి. అయినా కూడా నీరు ఇవ్వలేదు. చివరికి 2015లో సాగునీరు రాక పంట పంటకు విరామం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేతికి వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే గిట్టుబాటు ధర కూడా లభించక అప్పులపాలయ్యేవారు. దీంతో చేసేదేమిలేక బలవన్మరణాలకు పాల్పడిన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఇప్పుడు కూడా నాటి బాబు పాలనను తలుచుకుంటే రైతు కంట నీరు రాక మానదు.

రైతాంగాన్ని నిలబెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

బాబు హయాంలో రైతాంగం ఎదుర్కొన్న కష్టాలను పాదయాత్రలో స్వయంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ రైతులకు ప్రభుత్వం చేయాల్సిన సాయాన్ని అందించడంలో మరో ఆలోచన లేకుండా ముందుకు వెళ్లారు. గ్రామాలకు రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చి రైతులకు అందుబాటులో అధికారులను తీసుకొచ్చారు. విత్తన పంపిణీ, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు, వ్యవసాయ మెళకువలు, చీడ పీడ నివారణ చర్యలకు రైతులు ఆర్బీకేలను సంప్రదించేలా చేశారు. రైతులకు పెద్దపీటు వేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంది. కేసీ ఆయకట్టు కింద వ్యవసాయం చేసే రైతులకు ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలోనే సాగునీరు అందిస్తున్నారు. ప్రతి ఏటా కేసీ ఆయకట్టులో వరి పైర్లు విస్తారంగా పండటంతో పాటు మంచి దిగుబడులు వస్తున్నాయి. ఎకరాకు 32–40 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు వస్తున్నాయి. గిట్టుబాటు ధరలు మాత్రం ఆశాజనకంగానే ఉన్నాయి. 2021లో అధిక వర్షాలు పంటలు దెబ్బతినగా సీజన్ ముగియగానే పంట నష్ట బీమా సొమ్మును మైదుకూరు నియోజకవర్గంలో రూ.79కోట్ల బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ

రూ.1300 కోట్లతో కుందూ విస్తరణ పనులు

ప్రతి ఏటా అధికంగా కురిసే వర్షాలకు కుందూనది వరద నీటితో ఉప్పొంగడంతో వేలాది ఎకరాల వ్యవసాయ పంటలు మునకకు గురయ్యేవి. దీంతో రైతుల శ్రేయస్సు దృష్ట్యా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1300 కోట్లను కేటాయించగా కుందూ నది విస్తరణ పనులు జరుగుతున్నాయి. కర్నూలు, కడప జిల్లాలో గతేడాది నుంచి ఈ విస్తరణ పనులు మమ్మురంగా చేస్తున్నారు. దీంతో రైతులు పండించిన పంట కుందూ వరదకు గురి కాకుండా ఉంటుంది. గత ప్రభుత్వం కుందూని పరీవాహక ప్రాంతాల్లో వరద కారణంగా పంట నష్టపోతున్న ఎటువంటి చర్యలు చేపట్టక రైతాంగాన్ని విస్మరించింది.

రెండు ప్రభుత్వాలలో కేసీ ఆయకట్టుకు సాగు నీటి కేటాయింపు వివరాలు (టీఎంసీలలో..)

ఏడాది	ఖరీఫ్	రబీ	ఏడాది	ఖరీఫ్	రబీ
2014–15	2.79	0.0	2019–20	5.20	2.30
2015–16	3.79	6.60	2020–21	6.44	2.50
2016–17	6.70	2.08	2021–22	8.50	2.45
2017–18	2.17	6.17	2022–23	8.41	4.23
2018–19	1.05	4.06	2023–24	--	--

జగన్ హయాంలో సంవృద్ధిగా సాగునీరు



2029 ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు రెండు కార్ల పంటలకు సాగునీరు సంవృద్ధిగా అందుతోంది. వర్షాలు బాగా పండటం వలన నీటి సమస్య లేదు. కొన్ని చోట్ల మూడో కారు పంటలు కూడా పెట్టారు. 2014–19 వరకు కరువు, కాటకాలు, వర్షాలు రాక సాగుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీరు ఉన్న సమయంలో రైతులతో అన్ని రాజకీయ, ప్రజా సంఘాల వారు ఉద్యమాలు చేసి సాగునీరు తెప్పించుకునే దుస్థితి బాబు ప్రభుత్వంలో ఉండేది.

– ఏవీ రమణ, రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, మైదుకూరు

బాబు పాలనలో నానా అవస్థలు



గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే విత్తనాలు, జీలుగల కోసం నానా ఇబ్బందులు పడేవాళ్లం. రోజుల తరబడి మండలానికి వచ్చి గంటల కొద్ది క్యూలలో నిలబడి అవస్థలు పడ్డాం. జీలుగలను దళారుల చేతుల్లోకి పోయి బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయేవి. 2019 నుంచి రైతు భరోసా కేంద్రాలు రావడం వలన ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలోని విత్తనాలతోపాటు ఎరువులను కూడా తెచ్చుకుంటున్నాం.

– నరసింహారెడ్డి, రైతు, లక్ష్మీపేట, చాపాడు

నేడు 'ఎదమీటిన రాగాలు' పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటలోని కోదండరామస్వామి కల్యాణ మండపంలో శనివారం ఉదయం 9.30 గంటలకు కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన 'ఎదమీటిన రాగాలు' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు కళాభారతి సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శీను, చదువుల సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డీకే చదువుల బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి, ఏపీ అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య, వైవీయూ లలితకళల విభాగం అచార్య మూల మల్లికార్జునరెడ్డి, కవి ఏసీ దస్తగిరి, కథా రచయిత తవ్వా ఓబుళరెడ్డి హాజరవుతారని వారు వివరించారు. సాహితీ వేత్తలు, సాహిత్య అభిమానులు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

బి.కోడూరు ఎంపీహెచ్‌ఈఓగా శ్రీనివాసులరెడ్డి

బి.కోడూరు : మండల కేంద్రంలోని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్‌ఈఓగా శుక్రవారం శ్రీనివాసులరెడ్డి వైద్యాధికారులు డాక్టర్ వినీత్ కుమార్, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన నరసాపురం ఎంపీహెచ్‌ఈఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ నరసింహారెడ్డి నరసాపురం పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడులు

తొండూరు : ఘన జీవామృతం ఎరువులు వాడితే పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణ తెలిపారు. తొండూరులో కేపీపీ సర్వేలో భాగంగా ఏపీఎం, సీసీల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ఘన జీవామృతం తయారు చేయు విధానంపై డెమో ద్వారా తయారు చేశారు. ఏపీఎం వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి బాగుపడుతుందని చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలాదేవి

కాశినాయన : అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కలసపాడు ఎంపీపీ నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం కలసపాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌బీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి సారించి జగనన్న గృహాలు సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నవరత్నాల పథకాలకు అర్హులైన వారు ఉంటే గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దారు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలి

మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ సీఎం బాషా

పోరుమామిళ్ల : ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా తెలిపారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు, తెలిసేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 12 పంచాయతీల్లో పూర్తయిందని, ఆ పంచాయతీలకు రూ.20 లక్షలు చొప్పున నిధులు వచ్చాయన్నారు. అయితే అన్ని శాఖలవారు పనులు చేపట్టి నిధులు వినియోగిస్తుండగా, విద్యుత్‌శాఖ అధికారులు ఇంతవరకు ఎక్కడా పనులు మొదలు పెట్టలేదని, ఎస్టిమేట్స్ కూడా వేయలేదన్నారు. కవలకుంట్ల పంచాయతీలో ఇంకా తీర్మానం కూడా చేయకపోవడం వల్ల అభివృద్ధి పనులు జరగలేదన్నారు. జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ మొదటిసారిగా ఈ సంవత్సరం వేసవిలో ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా గడచిపోయిందన్నారు. 2 సంవత్సరాల తరువాత సచివాలయ సిబ్బందికి బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. జగనన్నకాలనీల్లో ఇంటిస్థలం పొందేందుకు 39 మంది లబ్ధిదారుల ఎంపిక జరిగి 9 నెలలవుతున్నా ఇంతవరకు వారికి ప్లాటు కేటాయించలేదన్నారు. ఐడీ నెంబరు పొంది, అర్హతలున్న వారికి రెవెన్యూ అధికారులు ఎందుకు స్థలం ఇవ్వలేక పోతున్నారన్నారు. టేకూరుపేట పంచాయతీకి విద్యుత్ స్తంభాల అవసరం గురించి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి పోరుమామిళ్ల, టేకూరుపేట ఆసుపత్రుల నుంచి ఒక్క అధికారి కూడా హాజరుకాకపోవడం పట్ల జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్య, విద్యుత్, హౌసింగ్, వెటర్నరీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, ఉపాధి హామీ అధికారులు తమ శాఖల్లో అభివృద్ధి వివరించారు. స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నూర్జహాన్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎన్‌వైకే అధికారి మణికంఠ

మైదుకూరు : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ అన్నారు. మైదుకూరులోని ఎస్‌వీ స్టడీ సర్కిల్‌లో శుక్రవారం నెహ్రూ యువకేంద్రం, అమ్మసేవా సమితి ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ మేరీ లైఫ్‌లో భాగమైన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పేరుతో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠతో పాటు వనిపెంట అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. వాటిని మానేసి జనపనార బ్యాగులను వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో 10 మొక్కలైనా నాటాలని తెలిపారు. కార్యక్రమంలో చలమయ్య, అటవీశాఖ సిబ్బంది, స్టడీ సర్కిల్ యజమాని ప్రజాపతి, వి.శివశంకర్ పాల్గొన్నారు.

అత్యవసర చికిత్సతో విలేజ్ క్లినిక్‌లు బలోపేతం



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లక్ష్మీకర్

ప్రొద్దుటూరు క్రైం : అత్యవసర చికిత్సలు అందించడం ద్వారా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మరింత బలోపేతం అవుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో వైద్యానికి సంబంధించిన మెలకువలను తెలుసుకొని గ్రామ స్థాయిలో మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ లక్ష్మీకర్, వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్లు శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్స్ జయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత



నోట్ పుస్తకాలు ఇస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం టెన్త్, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య, ఉపాధ్యక్షుడు జీసీ పుల్లయ్య పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. సాకం భాస్కర్, శ్రీను, రామకృష్ణ, నల్లం శంకర్, లక్ష్మయ్య, ప్రసాద్, నాగభూషణం, తులశయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది

– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు మతిభ్రమించడం వలన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అతను చెప్పే మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుమ్మరోనిపల్లె గ్రామంలో జీ.రామ్మూర్తి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎన్ని ఆర్థిక సంక్షోభాలు ఎదురైనా ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పకుండా మడమ తిప్పకుండా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. అది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు యువగళం పాదయాత్రలోను, మహానాడులోను మతిభ్రమించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

– ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రంలో ప్రజలు మరింత అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లె, అమ్మవారిపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంత మంచి పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, ఓబయ్య, నారాయణ, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, మండల తహసీల్దారు విద్యాసాగర్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో స్థానికులకే పెద్ద పీట

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఉద్యోగ నియామక పత్రాలు పొందిన యువకులతో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సంస్థ ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : బద్వేలుకు సమీపంలోని గోపవరం ప్రాజెక్టుకాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సెంచరీ ప్యానల్ పరిశ్రమలో చేపట్టనున్న ఉద్యోగాల భర్తీలో స్థానికులకే పెద్దపీట వేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు సంబంధిత సంస్థ ప్రతినిధులను కోరారు. సెంచరీ ప్యానల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇటీవల నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపికైన యువతకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బద్వేలు లాంటి వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోపవరం సమీపంలో సెంచరీ ప్యానల్స్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారని, ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 2 వేల మందికి, పరోక్షంగా 4 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమ ఏర్పాటు కావడం శుభపరిణామమని, తద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. పరిశ్రమ శంకుస్థాపన సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సంస్థ ప్రతినిధులు కూడా స్థానికులకే అధిక శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, ప్రస్తుతం ఇచ్చిన నియామకాలలో 98 శాతం మంది నియోజకవర్గ వాసులు ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. యువత పని పట్ల నిబద్ధత కలిగి ఉండాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ సూచించారు. ముఖ్యంగా ప్రైవేటు సంస్థల్లో చేసే ఉద్యోగాల్లో క్రమశిక్షణ, సమయపాలన, విధేయతతో పాటు జవాబుదారీతనంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, అడా చైర్మన్ సింగసాని గురుమోహన్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, సెంచరీ ప్యానల్స్ ప్లాంట్ హెడ్ దిలీప్, జీఎం రమేష్‌రెడ్డి, హెచ్‌ఆర్ శేఖర్‌రెడ్డి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.